6540
KB2-4

# ఊరు ఊరుకొంది

మంచిగాలివీస్తున్నది. మనుష్యులు నిద్రలేస్తున్నారు. మనుష్యు లెప్పటికైనా నిద్ర లేస్తారా అని కాచుకొని కూర్చున్న యువకుడు కళ్ళు పెద్దవిచేశాడు, చూశాడు. వీస్తున్న గాలికి అతడి దుస్తులు రెపరెపలాడాయి. అతను ఎదురు చూసే ఆ ముహూర్తాలు ఆగమించాయి. ఆగమించినవి ఆగకూడదని అతడి ఆకాంక్ష.

మనుష్యులు నడుస్తున్నారు రోడ్లునిద్రలేస్తున్నాయి. నిన్న మాపటివేళ ఆవలించి కళ్ళుమూసుకొన్న ఆఫీసులు అప్పుడే లేచి ఒళ్ళు విరుచుకొంటున్నాయి పోటు తిన రద్దీ కాలిబాటమీద రాటు తేరుకున్నది, నింపాదిగా ఉన్న తారు రోడ్డు జోరుని కూడపలుక్కుంటున్నది. సంచారం సంకలనం ప్రాక్టీసుచేస్తున్నది. యువకుడు, మన కథానాయకుడు రోడ్డుపట్టేను.

ఆతగాడి బతుకు అంతకుముందే రోడ్లపాలైంది. అందుకు అతడు సానుభూతికొరకు వెతకడు. విపులమైన నెన్నుదురు, కనులలో క్రొంబెనురు, వణుకు గొంతుక, అతడి సంతకం, ఇవన్నీ అతడి ఆనవాళ్ళు. అయితే వీటికి కొద్ది కాలం కిందట కాలదోషం పట్టాయి.

మునిసిపల్ చెత్తల డబ్బాదగ్గర యువకుడు నిలబడ్డాడు. అందరూ చూస్తూవుండగా అతను తాను తొడుక్కున్న నిరాశని విప్పేశాడు దాని జేబుల్లోవున్న ఆశాలేశాలని అందరిసమక్షంలో సురక్షితంగా భద్రపరిచాడు. అవి

ఒకటి ఆశ, రెండు ఆశయం. ఈ రెంటినీ రొంటిని దోపుకొని నిశ్శబ్దంగా నిష్క్రమించాడు. గుమిగూడిన జనులు చప్పట్లు కొట్టడం మరిచిపోయ్యారు. ఎవరేనా చెప్తేనేగాని జనం ఏదీ చెయ్యరు.

యువకుడు వంతెన మీదుగా వెళుతున్నాడు. వంతెన మీద జనప్రవాహం, వంతెనకింద జలప్రవాహం. యువకుడు రాకపోకలు ఆపేశాడు. వంతెనకి సాష్టాంగపడి ప్రాణదానం చేసినందుకు ప్రణామం ఆచరించాడు, లేచాడు. అందరివైపూ తిరిగి 'నన్ను చూసి నవ్వండి' అన్నాడు. జనం నవ్వారు. యువకుడు సాగిపోయ్యాడు.

దేవాలయంవచ్చింది. అవును, దేవాలయమేవచ్చింది. యువకుడు దానిదగ్గరకు వెళ్ళలేదు మానవుడు మేలుకొన్నప్పుడే దేవుడు గాభరా పడతాడు. యువకుడు దేవాలయంతో దెబ్బలాట పెట్టుకొన్నాడు. ప్రసాదం కంచం లంచంగా అతడిముందు కొచ్చింది. అతడు దానిని స్వీకరించలేదు. (అన్నట్లు అతను అరవై రెండు గంటలనించీ అన్నం ముట్టలేదు)

మంచిగాలి వీచడం మానేసింది మనుష్యులు కంపు కొడుతున్నారు. రాకపోకలు రాజసం ప్రదర్శించుతున్నాయి. యువకుడిమీద ఎండెక్కింది. దాన్ని మోసుకొంటూ అతడు ఒక ఆఫీసుముందుకు వెళ్ళ ఆగాడు. అయినా ఎండ అతడి వీపు దిగనంది.

అది జనన మరణాల రిజిస్ట్రారుగారి కచేరి. ఉద్యోగిగారు ఊపుకొంటూ వచ్చారు యువకుడు వారినిసగౌరవంగా

ఆపి చిన్న విషయం ఉందని మనవి చేసుకొన్నాడు. గంటకొట్టి బంట్రోతు చేత లోపలకు పంపించుతాను, అప్పుడు చెప్పుకో అన్నాడు ఆయన అల్లాగే అని యువకుడు అక్కడే పడిగాపులు పడ్డాడు. వీపుమీద ఎండ నెత్తికెక్కింది

చొక్కాలేని యువకుడిని కచేరీలోకి ఎలా పిలిపించడం అని ఉద్యోగిగారు కొంచెం ఆలోచించారు. నిరాశో, నిర్వేదమో, ఆతురతో, ఆందోళనో ఏదో ఒకటి ఉడుపులుగా కట్టుకొంటే నే గాని ఉద్యోగిముందుకు వెళ్ళడం ఉచితం కాదు. అయినా యువకుడి కళ్ళలో ఉద్వేగం ఉంది కాబట్టి ఉద్యోగి లోనికి పిలిపించాడు.

«ఏమిటి?» అని ప్రశ్నించాడు.

«ఏక జననం రిపోర్టు చెయ్యాలి» అన్నాడు యువకుడు ఉత్కంఠతో.

«ఎవరికి పుడతి?»

«నాకే!»

«ఎప్పుడు?»

«అరవై గంటలకిందట»

«అంటే?»

«మొన్న!»

«ఇన్నాళ్ళనుంచీ ఎందుకు రిపోర్టు చెయ్యలేదు?»

«పుట్టింది, చస్తే రెండూ ఒకసారే రిపోర్టు ఇద్దామనుకొన్నా.»

«సరే వివరాలు చెప్పు, నీపేరు?»

చెప్పాడు.

"నీ భార్య పేరు?"

"నాకు పెళ్ళి కాలేదు"

ఉద్యోగి ఉరిమిచూశాడు. ఒంటికాలిమీద కుంటుతున్న ధర్మం ఓపిక లేక పడిపోవడానికి గల కారణం యువకుడి మొఖంమీద ఆ ఉద్యోగిగారికి కనబడింది.

"సరే— దాని పేరు?"

"దేని పేరు?"

"నీ భార్య, కాదు—ఆ స్త్రీ పేరు?"

"స్త్రీ ఎవరూ లేదు."

తండ్రెవరో తెలియకుండా బిడ్డలు పుట్టవచ్చుగాని, తల్లే లేకుండా సంతానం ప్రాప్తమేమిటని ఉద్యోగి విస్తుపోయాడు. "ఆడది లేకుండా పిల్ల లెలా పుడతారయ్యా!" అన్నాడు.

"నాకు పిల్లలు పుట్టలేదు."

"మరెందుకు ఇక్కడికి వచ్చావు?"

"జననం రిపోర్టు చెయ్యడానికి"

"ఏ జననం?"

"నాకు మానవత్వంమీద నమ్మకం కలిగింది. జీవితం మీద ఆశ జనించింది. ఆ విషయం రాసుకోండి" అన్నాడు యువకుడు.

తండ్రయిన వాడిమీద తలకుమించినభారం ఉంచడం భావ్యం కాబట్టి ఉద్యోగిగారు యథాప్రకారంగా యువకుడి నెత్తిమీదికి ఎండని ఎక్కించారు.

ఊరు ఊరుకొంది.